# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, బుధవారం 30 అక్టోబర్ 2024 | VIKARABAD


## సీఎం రేవంత్.. తుగ్లక్ విధానాలు మానుకోవాలి..



బీఆర్ఎస్ హయాంలో గురుకుల పాఠశాలలు చాలా బాగా కొనసాగాయి. వాటిలో చదివే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం అందింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని గాలికి వదిలేసింది. గురు కులాల్లో కలుషిత నీరు, ఆహారంలో పురుగులు, భవనాల అద్దెలు చెల్లించడంతో ప్రభుత్వం విఫలమైనది. రేవంత్ సర్కారు గురుకులాల ఉనికి దెబ్బతీసేందుకు ఇటీవల రెండు వేల మంది ఉద్యోగులను తొలగించింది. సీఎం తుగ్లక్ పాలనను మానుకోవాలి.

–మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే , వికారాబాద్



ఎన్నెపల్లి మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల

# గురుకులాలకు.. కిరాయి కష్టాలు..

**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం సంక్షోభంలో కూరుకుపోయింది.** సబ్బండ వర్ణాలను రేవంత్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన గురుకుల పాఠశాలలపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. కేసీఆర్ హయాంలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందితే.. ప్రస్తుత సర్కారు తీసుకుంటున్న చర్యలతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలల కిరాయిలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ హయాంలో అద్దె భవనాలకు ప్రతినెలా సక్రమంగా అద్దె చెల్లించడంతోపాటు.. విద్యార్థులకు మెస్‌చార్జీలు అందించి వారు బాగా చదువుకునేలా ప్రోత్సహించింది. గురుకుల పాఠశాలలు ఎలాంటి సమస్యల్లేకుండా కొనసాగితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరొస్తుందనే అక్కసుతోనే గురుకుల పాఠశాలలను మూసివేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగు నెలలుగా అద్దె రావాల్సి ఉండడంతో ఆ బకాయిల కోసం భవనాల యజమానులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ)

**గత నాలుగు నెలలుగా అద్దె పెండింగ్**

**అధికారుల చుట్టూ యజమానుల ప్రదక్షిణలు, పడిగాపులు**

**వికారాబాద్‌లో బాలికల గురుకుల పాఠశాల భవనానికి ఏడాదిగా అద్దె బకాయి**

**జిల్లావ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న 15 గురుకుల పాఠశాలలు**

**సంక్షేమాన్ని సంక్షోభంలో పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**


వికారాబాద్ జిల్లాలో 15 గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా యి. సీఎం సొంత నియోజక వర్గమైన కొడంగల్‌లో నాలుగు గురుకుల పాఠశాలలుండగా.. వాటిలో ఎస్టీ గురుకులానికి సొంత భవనం ఉన్నది. బీసీ గురుకుల కా లేజీ గతంలో మొయినాబాద్‌లో ఉండగా దానిని స్థానికంగా అద్దె భవనంలోకి మార్చారు. ఆ భవనానికి నాలుగు నెలల అద్దె బకాయిలు రూ.4.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉన్నది. అదేవిధంగా మైనార్టీ గురుకుల పాఠశాల బొంరాస్ పేట మండలంలోని చిలుముల్ మైల్వార్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్నది. దానికి నెలకు రూ.లక్షా9 వేల చొప్పున గత నాలుగు నెలలకు రూ.4.36 లక్షలు, చేవెళ్ల మండలంలోని ముడిమ్యాలలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలకు నెలకు రూ.4.51 లక్షల చొప్పున ఐదు నెలలకు రూ.22.55 లక్షల అద్దె బకాయిలు రావాల్సి ఉన్నాయి. పరిగిలో ఐదు గురుకుల పాఠశాలలున్నాయి. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలున్నాయి. బీసీ బాలుర, బాలికల భవనాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పరిగిలోని బీసీ బాలుర, బాలికల భవనాలకు సంబంధించి ఐదు నెలల అద్దె పెండింగ్‌లో ఉన్నది. బాలుర భవనానికి నెలకు అద్దె రూ.1.80 లక్షల చొప్పున ఐదు నెలలకు రూ.9 లక్షలు, అదేవిధంగా బాలికల భవనానికి నెలకు రూ.6.40 లక్షల చొప్పున ఐదు నెలలకు రూ.32 లక్షల అద్దె బకాయిలు రావాల్సి ఉన్నది.

తాండూరు సెగ్మెంట్, పెద్దేముల్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో ఉన్నది. దాని అద్దె రూ.6 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మైనార్టీ గురుకుల పాఠశాలలు రెండు కొనసాగుతుండగా, ఈ రెం డు భవనాల్లో ఒక బిల్డింగ్‌కు ఏడాదిగా అద్దె పెండింగ్‌లో ఉంటే మరో భవనానికి నాలుగు నెలలుగా చెల్లించాల్సి ఉన్నది. శివారెడ్డిపేటలోని గురుకుల పాఠశాల అద్దె భవనానికి రూ.12 లక్షలు, మరో భవనానికి నాలుగు నెలల అద్దె బకాయిలు రూ.56 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు భవనాల యజమానులు పేర్కొంటున్నారు. చేవెళ్ల మండలం, ధర్మసాగర్‌లోని బీఎస్‌ఐటీ కాలేజీలో వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఇంటర్మీడియెట్ గురుకుల కాలేజీ కొనసాగుతుం డగా రూ.30 లక్షల వరకు అద్దె బకాయిలున్నాయి. చేవెళ్లలోని సాగర్ ఇంజినీరింగ్ కాలేజీలో కొడంగల్ సెగ్మెంట్‌కు చెందిన బాలికల పాఠశాలతోపాటు వికారాబాద్, పరిగి, వికారాబాద్ బాలికల ఇంటర్మీడియెట్ గురుకుల కాలేజీలు నడుస్తున్నాయి. ఆ భవనానికి అద్దె దాదాపుగా రూ.31.40 లక్షల వరకు రావాల్సి ఉన్నది.



శివారెడ్డిపేట మైనార్టీ బాలికల పాఠశాల

### ఎనుకటి రోజులు మళ్లీ వస్తున్నాయి..



బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు రాష్ట్రంలో 50 గురుకుల పాఠశాలలున్నాయి. కేసీఆర్ 1,100 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించారు. పదేండ్ల కాలంలో గురుకుల పాఠశాలల విద్యా ర్థులు ధర్నాలు చేసిన దాఖలాల్లేవు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల కాలంలోనే గురుకులాలలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నది. విద్యార్థులకు వసతులను సక్రమంగా కల్పించకపోవడంతో వారు రోడ్డెక్కుతున్నారు. రాష్ట్రంలో ఎనుకటి రోజులు మళ్లీ వస్తున్నాయి. రేవంత్ పాలనను చూసి ప్రజలు చీదరించుకుంటు న్నారు.

–నాగేందర్‌గౌడ్,
టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్

**తెలంగాణ గ్రామీణ బ్యాంకు సిబ్బంది నిర్వాకం**

**ఫోర్జరీ సంతకాలు, డాక్యుమెంట్లతో రుణాలు**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతులు**

# రైతుల పేరున రుణాలు..

బంట్వారం, అక్టోబర్ 29 : రైతుల పేరున ఫోర్జరీ సంతకాలు, డాక్యుమెంట్లతో బ్యాంకు సిబ్బంది రుణాలు తీసుకున్న ఘటన మంగళవారం మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఇద్దరు రైతులు రుణాలు తీసుకుని రెన్యూవల్ కూడా చేశారు. కానీ, బ్యాంకుకు చెందిన అధికారులు సదరు రైతులకు ఫోన్లు చేసి మీ పేరున బ్యాంకులో అప్పు ఉన్నదని.. దానిని ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించడంతో బాధిత రైతులు ఆశ్చర్యపోయారు. బ్యాంక్‌కు వెళ్లి ఇప్పటికే తమ రుణాలను చెల్లిస్తే, ఇంకా అప్పు ఎందుకు ఉంటుందని సిబ్బందిని నిలదీశారు. ఒకే రైతు పేరున రెండు సార్లు రుణాలు తీసుకున్నట్లు సిబ్బంది చెప్పగా.. వాటిని సంబంధించిన వోచర్లు, రికార్డులను చూపాల ని అడిగితే మేనేజర్ నిరాకరించడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





బంట్వారంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు



**నూరుల్లపూర్ గ్రామానికి చెందిన రైతు షేక్ మఖీద్**‌కు 4.35 ఎకరాల పొలం ఉన్నది. అతడు గత నాలుగేండ్లుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకుంటూ రెన్యూవల్ కూడా చేస్తున్నాడు. ప్రతిసారి లాగే ఈ ఏడాది ఆగస్టు 19న కూడా రెన్యూవల్ చేశాడు. అయితే అతడికి బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి మీ పేరున రుణం ఉన్నదని పది రోజుల్లో రెన్యూవల్ చేయాలని చెప్పడంతో కంగుతిన్నాడు. మరుసటి రోజు బ్యాంకుకెళ్లి విచారించగా.. అక్కడ అతడి ఆధార్ కార్డు పెట్టి, ఫొటో ను అతడిది కాకుండా వేరే వారిది పెట్టి రూ.1,60,000 రుణం తీసుకున్నారు. అంతేకాకుండా మఖీద్ ఆంగ్లంలో సంతకం చేస్తాడు. ఫోర్జరీ డాక్యుమెంట్లు, విత్‌డ్రాలో వేలిముద్రలతో సంతకం చేసి డబ్బులు కాజేసినట్లు గుర్తించాడు. దీంతో అతడు దాని కాపీ, తన బ్యాంకు ఖాతా వివరాల రిపోర్టు ఇవ్వాలని పట్టుబట్టగా.. బ్యాంకు అధికారులు ఈ విషయంపై విచారిస్తామని.. కొన్ని రోజుల సమయం కావాలని అతడిని బతిమిలాడారు. ఆగస్టులో ఈ ఘటన జరుగగా..దాదాపుగా రెండు నెలల తర్వాత మంగళవారం మఖీద్ బ్యాంకుకెళ్లి మేనేజర్‌ను కలిశాడు. నీ పేరున డబ్బులు తీసుకున్న వారు బ్యాంకుకు చెల్లించారని, ఆ విషయం మరిచిపోవాలంటూ ఉచిత సలహా ఇచ్చాడు. తన పేరున జరిగిన ఫోర్జరీ లావాదేవీల వివరాలను చెప్పడంతోపాటు ఫోర్జరీ చేసిన వారి పేరు చెప్పాలని అతడు పట్టుబట్టగా మేనేజర్ ససేమిరా అనడంతో అతడు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.



**మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన మర్పల్లి రాములు** తనకున్న 2.20 ఎకరాల భూమిపై తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. లక్ష రుణం తీసుకున్నాడు. దాన్ని తిరిగి రెన్యూవల్ కూడా చేశాడు. అయితే కొద్ది రోజుల కిందట బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి, మీరు తీసుకున్న రుణాన్ని వెంటనే చెల్లించాలని పేర్కొనడంతో అతడు కంగుతిని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



బ్యాంకులో గుమిగూడిన రైతులు

### రైతులను మోసం చేసినట్లు ఫిర్యాదు అందింది..

– మహిపాల్‌రెడ్డి ఎస్ఐ బంట్వారం

రైతులను మోసగించి, ఫోర్జరీ సంతకాలు, డాక్యుమెంట్లతో బ్యాంకు సిబ్బంది రుణాలు తీసుకున్నట్లు ఫిర్యాదు అందింది. దీనిపై కేసు నమోదు చేసి సమగ్ర విచార ణ జరుపుతాం. ఇలా ఎంతమంది రైతుల పేర్లతో రుణాలు తీసుకున్నారో తేల్చుతాం.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం.. సత్వర న్యాయం జరిగేలా చూస్తాం

**రంగారెడ్డి నూతన కలెక్టర్ నారాయణరెడ్డి**



రంగారెడ్డి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర న్యాయం అందేలా పని చేస్తామని రంగారెడ్డి నూతన కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్‌లోని ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలకు సత్వర న్యాయం జరిగేలా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు కులగణన పూర్తయ్యేలా అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పనతోపాటు జిల్లా సమగ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులతో కలిసి ముందుకెళ్తామన్నారు. సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మంగళవారం బిజీబిజీగా గడిపారు. మొదటి రోజు కులగణనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, చేవెళ్ల, కందుకూరు, షాద్‌నగర్ ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారి కలెక్టర్ కార్యాలయంలోని వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



# ఓటర్లు@36,51,513

**రంగారెడ్డి జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల**

**అత్యధికం శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లో 7,64,264 మంది**

**పురుష ఓటర్లు అత్యధికం శేరిలింగంపల్లిలో.. అత్యల్పం షాద్‌నగర్‌లో..**

**పోలింగ్ కేంద్రాలు 3,501.. థర్డ్‌జెండర్స్ 431 మంది..**

రంగారెడ్డి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 36 కోట్ల 51 లక్షల 513 మంది ఉన్నారు. అలాగే 3,501 పోలింగ్ కేంద్రాలుండగా.. థర్డ్‌జెండర్స్ 431 మంది ఉన్నారు. పురుష ఓటర్లు శేరిలింగంపల్లిలో అత్యధికంగా 4,03,352 మంది ఉండగా..అత్యల్పంగా షాద్‌నగర్‌లో 1,20,222 మంది ఉన్నారు. అదేవిధంగా మహిళా ఓటర్లు అత్యధికంగా శేరిలింగంపల్లిలో 3,60,769 మంది, అత్యల్పంగా షాద్‌నగర్‌లో 1,20,852 మంది ఉన్నారు.

**నియోజకవర్గాలవారీగా..**

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుష ఓటర్లు | మహిళా ఓటర్లు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 359 | 1,72,134 | 1,69,887 | 35 | 3,42,056 |
| ఎల్‌బినగర్ | 577 | 3,14,435 | 2,91,079 | 132 | 6,05,646 |
| మహేశ్వరం | 542 | 2,87,685 | 2,74,439 | 66 | 5,62,190 |
| రాజేంద్రనగర్ | 547 | 3,19,700 | 2,97,944 | 35 | 6,17,679 |
| శేరిలింగంపల్లి | 639 | 4,03,352 | 3,60,769 | 143 | 7,64,264 |
| చేవెళ్ల | 298 | 1,36,846 | 1,36,368 | 05 | 2,73,219 |
| కల్వకుర్తి | 271 | 1,23,934 | 1,21,436 | 02 | 2,45,372 |
| షాద్‌నగర్ | 268 | 1,20,222 | 1,20,852 | 13 | 2,41,087 |
| | 3501 | 18,78,308 | 17,72,774 | 431 | 36,51,513 |

## నకిలీ పత్రాలతో రూ.50కోట్ల రుణానికి అప్లికేషన్..

**నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్ సునీత**

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 29 : నకిలీ పత్రాలు సృష్టించి రూ.50కోట్ల రుణానికి దరఖాస్తు చేసుకున్న వారిపై ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పాడు గ్రామంలో సర్వేనంబర్ 131 నుంచి 166ల వరకు గల భూమికి చెందిన పత్రాలు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లుగా సృష్టించారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ స్టాంపు డిప్యూటీ తహసీల్దార్ సంతకం చేసినట్లు వసుంధర ఇంటిగ్రేటెడ్ శాటిలైట్ టౌన్‌షిప్, రిసార్ట్స్ ప్రైవేటు కంపెనీ అనే పేరుతో రూ.50కోట్ల రుణం కోసం ముంబయిలోని సిండికేట్ ఫైనాన్స్ బ్యాంకును సంప్రదించినట్లు సమాచారం, ఈ మేరకు బ్యాంకు పత్రాల నిర్ధారణ కోసం ముంబయికి చెందిన సిండికేట్ బ్యాంకు సిబ్బంది ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి పంపించారు. భూమి పత్రాలు పరిశీలించిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత అవి నకిలీ డాక్యుమెంట్లు అని తేల్చారు. తాము ఎలాంటి అనుమతి పత్రాలు ఇవ్వకుండా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు స్పష్టం చేసిన ఇబ్రహీపట్నం తహసీల్దార్...నకిలీ పత్రాలు సృష్టించి రుణంకోసం దరఖాస్తు చేసుకున్న సంస్థ ప్రతినిధులు రావి చక్రధర్, రావి శ్రీనివాస్‌రావులపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## లైసెన్స్ పొందడం సులభం కాదు..

**ఇకపై 3 గంటల వీడియో వీక్షించాల్సిందే**

**ప్రమాదాల నివారణకు ఆర్టీఏ అధికారుల ప్రణాళికలు**

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే 3 గంటల వీడియో వీక్షించాల్సిందే. అదేంటి అనుకుంటున్నారా? ఔను ప్రమాద రహిత ప్రయాణంపై రవాణా శాఖ అధికారులు 3 గంటల వీడియోను రూపొందించారు. ఈ వీడియోను లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ వీక్షించాలి. ప్రత్యేక రూంలో ఈ వీడియోను ప్రదర్శిస్తారు. ప్రమాదాలపై అవగాహన కల్పించే వీడియోను వీక్షించిన అనంతరం లైసెన్స్ ప్రక్రియ జరుగుతుంది. ఈ మేరకు ఆర్టీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయాల్లో వీడియో ప్రదర్శన అమలు చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన యాక్సిడెంట్‌లు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగిన ప్రమాదాలు, అతివేగంతో కూడిన ఘటనలు, బాధిత కుటుంబాల ఆవేదన తదితర హృదయవిదారక ఘటనలతో కూడిన వీడియోను ప్రదర్శిస్తారు. వాహనదారులకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.